మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



# జోగులాంబ జిల్లాలో 4 లక్షల 95 వేల 907 మంది ఓటర్లు

## జిల్లాలో 2.856 ఎన్నికల విధులలో పోలింగ్ సిబ్బంది

**ఇటిక్యాల,మే 12 ప్రభాతవార్త :**నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలలోని 2 నియోజకవర్గాలలో మొత్తం ఓటర్లు 4 లక్షల 95 వేల 907 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బిఎం సంతోష్ ప్రకటించారు. గద్వాల నియోజకవర్గంలో 2 లక్షల 56 వేల 828 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళా ఓటర్ల 1 లక్ష 30 వేల 978 మంది కాగా పురుషులు 1 లక్ష 25 వేల 639 మంది ఇతరులు మరో 11 మంది ఉండగా అలంపూర్ నియోజకవర్గంలో 2 లక్షల 39 వేల 079 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళలు 1 లక్ష 21 వేల 074 కాగా పురుషులు 1 లక్ష 17 వేల 997 కాగా ఇతరులు మరో 8 మంది ఉన్నారు. ఇప్పటికే వీరందరికి గ్రామాలలో బిఎల్ఓలు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయగా వీరందరూ సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొననున్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో 767 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1536 మంది ఓపిఓలు, 138 మంది మైక్రో పరిశీలకులు విధులు నిర్వహించనున్నారు. అలాగే గద్వాల నియోజకవర్గంలో 378 బ్యాలెట్ యూనిట్లు 378 కంట్రోల్ యూనిట్లు, 424 వివిప్యాట్లు అలంపూర్ నియోజకవర్గంలో 363 బ్యాలెట్ యూనిటుల, 363 కంట్రోల్ యూనిట్లు, 407 వివి ప్యాట్‌లు ఉన్నాయి. అంతేకాక గద్వాల, అలంపూర్ రెండు నియోజకవర్గాలలో 594 పోలింగ్ కేంద్రాలు ఉండగా గద్వాల నియోజకవర్గంలో 1456 మంది అలంపూర్ నియోజకవర్గంలో 1400 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించారు.

# పోలింగ్ డే..!



- నేడే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల ఎన్నిక
- ఉదయం 7నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్
- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు
- మహబూబ్‌నగర్‌లో 16,82,401, నాగర్‌కర్నూల్‌లో 17,34,773 ఓటర్లు
- జూన్4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 12, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలకు సోమవారం ఎన్నిక జరగనున్నది. ఉమ్మడి పాలమూరులోని రెండు పార్లమెంట్ స్థానాల్లో ప్రధాన పార్టీల నుంచి గట్టి పోటీ ఉన్నట్లు తెలుస్తున్నది. ఈమేరకుపోలింగ్‌కు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం రాత్రి వరకు పోలింగ్ సిబ్బంది, అధికారులు ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈమేరకు అధికార యంత్రాంగం ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఓటర్ల వివరాలు, కొత్త ఓటర్ల లెక్క, పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక కేంద్రాలు, తదితర అంశాలపై ఎన్నికల అధికారం అన్ని రకాల చర్యలకు యంత్రాంగం సిద్ధమైంది. సోమవారం పోలింగ్ జరుగనుండగా, జూన్ 4న కౌటింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. జూన్4వరకు అంటే ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు కోడ్ అమలులో ఉన్నది. పోలింగ్ సమయం సాయంత్రం 5గంటల వరకే ఉండగా ఎండల తీవ్రత దృష్ట్యా సమయం పొడిగించాలన్న కోరిక మేరకు ఈసీ గంట సమయం సడలించింది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించింది.

### సామగ్రితో తరలిన సిబ్బంది

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు, జడ్చర్లలోని డా. బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఆదివారం ఎన్నికల సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలారు. ఈమేరకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు.

### మద్యం, డబ్బు సీజ్..

లోక్ సభ ఎన్నికల నేపథ్యంఓ మద్యం ఏరులై పారుతున్నది. ఇప్పటికే మద్యం గ్రామాలకు తరలించినట్లు సమాచారం. ఆదివారం రాత్రి డబ్బు, మద్యం ఇంటింటికీ పంపిణీ చేసినట్లు తెలుస్తున్నది. గ్రామాల్లో ఆయా మాజీ సర్పంచులు, పార్టీ గ్రామాధ్యక్షులు, సీనియర్ నాయకులు చేతుల మీదుగా పంపిణీకి చర్యలు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ ఎన్నికల బరిలో మొత్తం 31మంది అభ్యర్థులు ఉన్నారు. ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 178కేసులు నమోదు చేసి రూ.2.46కోట్లు సీజ్ చేశారు. అనంతరం సరైన పత్రాలు చూయించిన వారి గుర్తించి 148 కేసులను తొలగించి, రూ.2.19కోట్లు రిలీజ్ చేశారు. ఇదిలా ఉండగా రూ.1.81కోట్ల విలువ చేసే 45వేల69లీటర్ల మద్యం పట్టుబడింది. ఇదిలా ఉండగా ఎన్నికల సందర్భంగా ఈసీ నిబంధనల మేరకు మంగళవారం ఉదయం మద్యం దుకాణాలు మూసివేయాలని అధికారులు ఆదేశించారు. పోలింగ్ స్టేషన్‌లో అనుమంతించబడే గుర్తింపు కార్డులు ఓటు వేయడానికి ఓటరు కార్డుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల అధికారులకు చూయించాల్సి ఉంటుంది. అయితే ఈసీ అనుమతించిన కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి..ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్,ఫొటో కలిగిన పెన్షన్ ధ్రువీకరణ ప్రతం, ఏదైనా రాష్ట్ర, కేంద్రం, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల జారీ చేసిన ఫొటో కలిగిన గుర్తింపు కార్డు, బ్యాంక్, లేదా పోస్టాఫీస్ పాస్ బుక్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక ధ్రువపత్రాలు ఆమోదిస్తారు.



### మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో నియోజవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

| అసెంబ్లీ | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 272 | 1,28,268 | 1,30,377 | 13 | 2,58,658 |
| జడ్చర్ల | 274 | 1,11,354 | 1,11,863 | 05 | 2,23,222 |
| దేవరకద్ర | 289 | 1,18,372 | 1,20,705 | 00 | 2,39,077 |
| నారాయణపేట | 270 | 1,16,261 | 1,19,254 | 02 | 2,35,517 |
| కొడంగల్ | 275 | 1,19,237 | 1,23,020 | 10 | 2,42,267 |
| మక్తల్ | 284 | 1,19,474 | 1,23,863 | 01 | 2,43,338 |
| షాద్‌నగర్ | 252 | 1,19,114 | 1,19,211 | 13 | 2,38,338 |

### నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నియోజవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

| అసెంబ్లీ | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| వనపర్తి | 296 | 1,35,367 | 1,37,282 | 04 | 2,72,653 |
| గద్వాల | 303 | 1,25,356 | 1,30,499 | 11 | 2,55,866 |
| అలంపూర్ | 290 | 1,17,997 | 1,21,074 | 08 | 2,39,079 |
| నాగర్‌కర్నూల్ | 259 | 1,18,764 | 1,19,366 | 03 | 2,38,133 |
| అచ్చంపేట | 265 | 1,23,234 | 1,24,382 | 05 | 2,41,621 |
| కల్వకుర్తి | 262 | 1,22,805 | 1,20,148 | 09 | 2,42,962 |
| కొల్లాపూర్ | 269 | 1,20,511 | 1,17,943 | 05 | 2,38,459 |









# వనపర్తిలో రేపటి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

**307 పోలింగ్ కేంద్రాలు,32 రూట్ల వారీగా ఎన్నికల సామాగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి భద్రతా దళాలతో తరలి వెళ్లిన ఎన్నికల సిబ్బంది**

**శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్**



**వనపర్తి ప్రతినిధి మే 12 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రేపే వనపర్తి జిల్లాలో పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఎన్నికల నిర్వహణకు బయలుదేరిన పోలింగ్ సిబ్బంది ,భద్రతా దళాల వాహనాలకు ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి జెండా ఊపి శుభాకాంక్షలు తెలుపుతూ సాగనంపారు.ఉదయం నుండి చిట్యాల మార్కెట్ గోదాములో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల అధికారి దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో 307 పోలింగ్ కేంద్రాల్లో రేపు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించే విధంగా పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.307 పోలింగ్ స్టేషన్ లకు 32 రూట్‌లు 16 కౌంటర్‌లు ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అన్ని మెటీరియల్,ఈవియంలు తీసుకొని భద్రతా దళాల కట్టుదిట్టమైన భద్రతా మధ్య రూట్‌ల వారీగా పంపించడం జరిగిందన్నారు.



పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లిన సిబ్బంది

ఎన్నికల సిబ్బంది ఎన్నికల నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఆదివారం సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ చేరుకొని అక్కడ రేపటి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకొని ఉదయాన్నే 5:30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించి అన్ని క్లియర్ చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభించి పారదర్శకంగా ముగించాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో చలువ నీడ తో సహా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రేపటి ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ,ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా నచ్చిన వ్యక్తికీ ధైర్యంగా ఓటు వేయాలని మీడియా ముఖంగా జిల్లా ప్రజలను కోరారు.

# పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తు..!

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 12 ప్రభాతవార్త :** సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం జరగనున్న పోలింగ్ సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఉన్న 3 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ అధికారులు, పోలీస్ రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్డ్ అధికారులతో పోలింగ్ అధికారులను పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్లకు పటిష్టమైన భద్రతతో తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలైన మహబూబ్‌నగర్ నియోజకవర్గం బాలుర జూనియర్ కాలేజ్, దేవరకద్ర నియోజకవర్గం బాలికల జూనియర్ కళాశాలలో జడ్చర్ల నియోజకవర్గం డా. బిఆర్ఆర్ కాలేజ్ జడ్చర్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సిబ్బందికి పోలింగ్ బందోబస్తు, భద్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు పటిష్టమైన భద్రత బందోబస్తు, భద్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలో పార్లమెంట్

### అల్లర్లు గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు ,జిల్లాలో 14 సెక్షన్




మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్, చిత్రంలో జిల్లా రిటర్నింగ్ అధికారి జి . రవినాయక్

ఎన్నికల పోలింగ్‌కు పటిష్టమైన భద్రత బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా 922 సివిల్, ఏఆర్‌ఫోర్స్, జిల్లా హెచ్‌జిఎస్, 200 కర్ణాటక హెచ్‌జిఎస్, 200 సిఐడి డిపార్టుమెంట్, 270 మంది ఎస్‌సిటిపిసిఎస్, 150 మంది టిఎస్‌ఎస్‌పి, 270 మంది కేంద్ర బలగాలు మొత్తం 1962 మందిని పోలింగ్ బందోబస్తుకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు మానిటరింగ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లను ప్రభావితం చేసే ప్రజలను ప్రలోభాలకు గురిచేసే డబ్బులు, వస్తువులు వంచకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నియమ నిబంధనలు ఉల్లఘించి, ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించిన, అల్లర్లకు, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

# ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల ప్రతినిధి మే 12 ప్రభాతవార్త :** పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేశామని, 13 వ తేదీన ప్రజలందరూ తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ విజ్ఞప్తి చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్ కోసం పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటింగ్ శాతం పెరగడానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం గద్వాల అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. 79 గద్వాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 303 పోలింగ్ కేంద్రాలకు గాను పి.ఓలు 303, ఎ.పి.ఓ లు 303, ఓ.పి.ఓ లు 606 మొత్తం 1212 మంది ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా 244 మందిని కేటాయించడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 44 మంది మైక్రో అబ్సేర్వర్లను నియమించడం జరిగిందని, గద్వాల లో 34 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్ కు ఒక్కో సెక్టార్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. వారికి ప్రత్యేక వాహనాలను, పోలింగ్ సిబ్బందిని తరలించుటకు 34 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
80 అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 291 పోలింగ్ కేంద్రాలకు గాను పి.ఓ లు 291, ఎ.పి.ఓ ల 291, ఓ.పి.ఓ లు 582, రిజర్వు 236 మందిని కేటాయించడం జరిగిందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 54 మంది మైక్రో అబ్సేర్వర్లను నియమించడం జరిగిందని అన్నారు. గద్వాల లో 31 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్ కు ఒక్కో సెక్టార్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. వారికి ప్రత్యేక వాహనాలను, పోలింగ్ సిబ్బందిని తరలించుటకు 31 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద భోజన సదుపాయాలుతో పాటు , త్రాగునీరు, మరుగు దొడ్లు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి అవసరమైన టెంట్లు, కూలర్లతో పాటు మెడికల్ కిట్లు ఓ ఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రశాంత్ వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. ఓటు వేయడం అందరి బాధ్యత అన్ని, జిల్లాలోని ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినుయోగించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.









ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, పోలింగ్ సిబ్బందిని తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా బస్సులు

## పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ చర్యలు..

**ఓటే మీ ఆయుధం-ధైర్యంగా ఓటేయండి:జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి**



**వనపర్తి ప్రతినిధి మే 12 ప్రభాతవార్త :** నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పంపిణీ కేంద్రం నుండి జిల్లాలో గల అన్ని పోలింగ్ కేంద్రాలకు భారీ భద్రత మధ్య తరలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి ,ఐపిఎస్ పోలీస్ అధికారులు సిబ్బంది అందరికి భద్రత పరంగా సూచనలు అందించడం జరిగింది ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో పోలీస్ అధికారిని నియమిస్తూ పంపిణీ కేంద్రం నుండి ఈవియంలకు రక్షణగా స్ట్రైకింగ్ ఫోర్స్‌ను పంపడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను నిష్పాక్షపాతంగా శాంతియుతంగా జరిగేలా భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకున్నామని ప్రతి పోలింగ్ స్టేషన్లో ఒక పోలీసు అధికారి ఉంటారని ఏటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్పందించే లాగువ పెద్ద సంఖ్యలో రూట్ మొబైల్ పార్టీలను నియమించడం జరిగిందని సెక్టార్ ఇన్చార్జీలనే కాకుండా ఒక్కో ప్రాంతానికి డీఎస్పీ స్థాయి అధికారులను నియమించినట్లు తెలియజేశారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో భారీ భద్రత విధించామని ఎన్నికలకు ఆటంకం కలగకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామని ఎవరికి భయపడకుండా ప్రజలందరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## అమ్మను మించిన దైవంలేదు..

**మన సేవసమితి ఆధ్వర్యంలో మాతృదినోత్సవం**



**జడ్చర్ల,మే 12 ప్రభాతవార్త :** ఈ సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని మనసేవా సమితి సభ్యులు మాతృమూర్తి ప్రేమను కొనియాడారు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా మన సేవా సమితి ఆధ్వర్యంలో పద్మావతి కాలనీలోని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులు అందరికి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని కోరారు. తాను తినకున్న బిడ్డల కడుపు నింపేది ఒక అమ్మ మాత్రమేనని అలాంటి మాతృమూర్తులకు కన్న ప్రేమను దూరం చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో మన సేవా సమితి సభ్యులు రఘు, రవిందర్‌రెడ్డి, వేణు, రాధాకృష్ణ, శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

**జడ్చర్ల,మే 12 ప్రభాతవార్త :** జగద్గురువులు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య జయంతి కార్యక్రమాన్ని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత బజారులోని శివాలయంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జయంతి సందర్భంగా ఆదివారం పంచామృతాభిషేకం ఆంజనేయస్వామికి, శివుడికి రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో భక్తి భావన పెంపొందించడానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీ లక్ష్మి నరసింహారావు, ప్రదీప్ పాటిల్, ఆలయ ధర్మకర్త భార్గవశర్మ, రాఘవేంద్రరావు, మంగు ప్రవీణ్, వెల్దండ శ్రీధర్, శిరీష్‌కుమార్, శ్రీనివాస్, వెంకట్రావు, గట్టు నవీన్ ఇరివెంటి శ్రీకాంత్, ప్రసాద్, కృష్ణశాస్త్రి, గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది ...

**ఇటిక్యాల మే 12 ప్రభాతవార్త :** సోమవారం పార్లమెంటు ఎన్నికలు జరుగుతుండగా పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే అధికారులు పిఓ ,ఏపివో,ఓపివో పోలిస్ సిబ్బంది ఇతర సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. రూట్ నంబర్ 13లో కోండేరు ,జింకలపల్లి,వేముల, కోదండపురం, పుటాన్ దొడ్డి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలకు రూట్ సెక్టోరియల్ అధికారి ఎంపీడీవో మహమ్మద్ అజార్ మొహియుద్దీన్. అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి మండల ఈ పంచాయతీ ఆపరేటర్ భార్గవ్ రెడ్డిల ఆధ్వ ర్యంలో అల్లంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కేంద్రం నుండి ఎన్నికల్లో ఉపయోగించే ఈవీయం లు,వి.వి ప్యాట్లు,కంట్రోల్ యూనిట్‌లను వెంట తీసుకొని వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని చేర్చారు.



## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**పెద్దమందడి మే 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జగత్‌పల్లి గ్రామంలో అనారోగ్యంతో శనివారం ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఒక్కొక్కరికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని పంపించారు. బోగం కృష్ణయ్య భార్య బోగం శాంతమ్మ, తోకలి కురుమయ్య భార్య తోకలి అలివేల గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు గట్టు యాదవ్, పెద్దుప్పరి బీచుపల్లి పుట్టలయ్య, పర్వతాలు, ముష్టి రాములు, వెంకటరాములు, ఉప్పరి చంద్రయ్య, బాలకిష్టి తదితరులు మృతుల కుటుంబాలకు నగదు అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.జి చెన్నారెడ్డి తనయుడు జిల్లెల ఆదిత్యరెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి లు మృతుల కుటుంబాలకు రూ.5వేల చొప్పున పంపగా గ్రామ నాయకులు అందజేశారు.

## ఘనంగా మాతృదినోత్సవం



**చిన్నచింతకుంట,మే 12 ప్రభాతవార్త :** అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దినోత్సవంతో పాటు నర్సింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కమ్యూనిటీ హాల్‌లో మదర్స్‌డే, నర్సింగ్‌డేను అమ్మ సేవా సమితి నిర్వాహకులు సి. భక్తరాజు ఆధ్వర్యంలో జరిగింది. మదర్స్‌డే సందర్భంగా శ్రీలత, తులసిదేవి, బిజెపి నాయకురాలు నంబిజ్యోతి పాల్గొని రోగులకు పండ్లు, బ్రెడ్స్, పేద,వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి స్టాఫ్‌నర్సు అనిత, గ్రామ నాయకురాలు లలితరెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎస్. శేఖర్, పొర్ల వెంకటేష్, దాసరి నరసింహ, ఎంకె విజయ్, ఎం. సుదర్శన్, నెహమియా, తేజ, రాహుల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



**లింగాల,మే 12 ప్రభాతవార్త :** నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఆదివారం చేరుకున్నారు. మండలంలోని మొత్తం ఓటర్లు 30,904 ఉండగా, అందులో పురుషులు 15280 మంది ఉండగా, మహిళా ఓటర్లు 15623 మంది ఉండగా, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు. మండలంలోని మొత్తం 47 పోలింగ్ బూతులు ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ ఉమా తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఏజెంట్లను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి....

**-ఓటు వేయడం మనందరి బాధ్యత.. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని గ్రామాల్లో పట్టణాలు మరియు నగరాల్లో 100 శాతం ఓటింగ్ నిర్వహించడానికి కృషి చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్లు నిర్భయంగా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. పార్లమెంట్ సాధారణ ఎన్నికలు 2024 ఎన్నికల నియమావళి అమలులో భాగంగా జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు వేయాలని, దేశ పౌరులుగా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లోని వనపర్తి, అలంపూర్, జోగులాంబ గద్వాల్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకొని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 100 శాతం పోలింగ్ పూర్తయ్యేలా ఓటర్లందరు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది...

**-ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలన...**

**-నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చేపడుతున్న ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించిరు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. పీఓలు, ఏపీఓలు, ఓపీఓలతో కూడిన బృందాలన్ని హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పక్కగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా లేదా అన్నది సరిచూసుకోవాలని కలెక్టర్ అధికారులను సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి సకాలంలో నిర్ధేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తన దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌ను నిర్వహించాలన్నారు. ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టి, ఉదయం 7గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంభించాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేధించాలని అన్నారు. ఈవీఎంలకు ఏమైనా సెక్టార అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేధించాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలన్నారు. సజావుగా ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని, ఎన్నికల సామాగ్రి పంపిణీకి పకడ్బంది ఏర్పాట్లు చేయడంతో పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్ధేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి కలెక్టర్



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బంది

## పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు..

**పంపిణీ కేంద్రాల నుండి ఈవిఎంలు, పోలింగ్ సామాగ్రి తరలింపు; పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 12 ప్రభాతవార్త :** పంపిణీ కేంద్రాల నుండి పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలను భద్రంగా తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ సూచించారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో, మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి దేవరకద్రకు సంబంధించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, జడ్చర్లలో బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి ఈవిఎంలు, పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లో పంపిణీకి చేపట్టిన ఏర్పాట్లపై, పోలింగ్ సిబ్బంది హాజరుపై అధికారులను వివరాలకు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్ తీసుకుని అప్రమత్తంగా వెళ్లాలని సూచించారు. అదేవిధంగా మెటీరియల్ అంతా ఉన్నదా లేదా అని సరిచూసుకోవాలని తెలిపారు. అన్ని సక్రంగా చూసుకోవాలని, ఏది మర్చిపోవద్దని సూచించారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పని చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాధ్యతయుతంగా పని చేయాలని చెప్పారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వవద్దని, సమస్యలు ఏమైనా ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈవిఎంలు తరలించే వాహనాలకు జిపిఎస్ అనుసంధానం చేశామని, పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ఈవిఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేవిధంగా జాగ్రత్తగా మహబూబ్‌నగర్‌లోని స్ట్రాంగ్ రూములకు తరలించాలని పేర్కొన్నారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. జడ్చర్లలోని బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్‌తో పాటు మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా, ఎస్పీ హర్షవర్ధన్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మన్యంకొండలో ఘనంగా తిరుచ్చి సేవ:అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి

**దేవరకద్ర,మే 12 ప్రభాతవార్త :** మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మంపడం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య స్వామివారి తిరుచ్చిసేవ ముందు కదిలింది. అనంతరం మళ్లీ స్వామివారిని తిరుచ్చి వాహనంపై గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది శ్రీకాంత్, సుదర్శన్‌గౌడ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి సేవ నిర్వహిస్తున్న పురోహితులు

## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

**చిన్నచింతకుంటమే 12 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాలలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ కలెక్టర్ ముకుందరెడ్డి తెలిపారు. మండలంలో 30,651ఓటర్లు ఉన్నారని వీరిలో స్త్రీలు 15961, 14960 పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో 168 నుంచి 208 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు పర్యవేక్షణలో పోలింగ్ జరగనున్నదని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లోని కేంద్రాల వద్దకు ఈవిఎంలతో పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు.

**వందమంది పోలీసులతో బందోబస్తు...** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వందమంది పోలీసులతో బందోబస్తు చేపడుతున్నామని స్థానిక ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు. చిన్నచింతకుంట, ముచ్చింతల గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించడం జరిగిందని ఈ గ్రామాల్లో సాయుధ బలగాలతో బందోబస్తు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై చట్టరిత్యా చర్యలు తప్పవని ఎన్నికల అధికారులు హెచ్చరించారు.



పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాల పహారా

## ఎన్నికల విధుల్లో తప్పిన ముప్పు...

**-ఫిట్స్‌తో ఆసుపత్రిలో అడ్మిట్ అయిన పోలింగ్ అధికారి -సకాలంలో వైద్యం అందడంతో తప్పిన ప్రమాదం**

**అచ్చ ంపేట, మే 12 ప్రభాతవార్త:** ఎన్నికల విధి నిర్వహణలో అపశృతి చోటు చేసుకుంది. పోలింగ్ విధులకు హాజరైన ఉద్యోగికి తృటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం అచ్చంపేట పట్టణంలో మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ అధికారిగా జిల్లా ఆర్‌అండ్‌బి శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటస్వామి ఫిట్స్ వచ్చి స్పృహ తప్పి పడిపోయారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్ వెంటనే స్పందించి అతనికి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అచ్చంపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ తారాసింగ్ స్పృహ తప్పిన పీఓ విధులు నిర్వహించే స్థితిలో లేదని తెలుపడంతో అడిషనల్ కలెక్టర్ అతని ఉత్తర్వులను రద్దు చేసి వారే వారికి ఉత్తర్వులు అందించారు.



స్పృహ కోల్పోయిన అధికారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

## బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సంక్షేమం..

**ఐదు నెలలకే కాంగ్రెస్ అతలాకుతలం చేసింది, హామీల అమలులో విఫలం,మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 12 ప్రభాతవార్త :** పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కాడెద్దుల సాగించామని మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దడవాయి, హమాలీ సంఘానికి సంబంధించిన నాయకులు రాజు, నాగరాజు, యాదయ్య, విజయ్, స్వామిల ఆధ్వర్యంలో పలువురు భారత రాష్ట్ర సమితిలో చేరారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే పరిస్థితి అంతా అతలాకతలం అయిందన్నారు. ఇచ్చిన గ్యారంటీలు అమలుకాక, కరెంటు నీళ్ల లేక రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పదేళ్ల బిఆర్ఎస్ పాలనను నాలుగు నెలల కాంగ్రెస్‌పాలనను గ్రామీణ ప్రజలకు అర్థమైందన్నారు. పార్లమెంట్‌ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కౌన్సిలర్లు కోట్ల నరసింహ, శ్రీనివాస్, వేదావత్, గణేష్, పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్

## నేడు పోలింగ్

**ఉప్పునుంతల,మే 12 ప్రభాతవార్త :** సాధారణ లోక్‌సభ ఎన్నికలు నేడు మండలంలో పోలింగ్‌కు కేంద్రాలు సన్నద్ధమయ్యాయి. మండలంలో 30 వేల 483 మంది ఓట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 14 వేల 987, మహిళా 15 వేల 496 ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ 12, సాధారణ ఎన్నికలకు 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 9 రూట్లను ఎంపిక చేసినట్లు తహసిల్దార్ వివరించారు. గతంలో 34 పోలింగ్ కేంద్రాలు ఉంగా పార్లమెంట్ సాధారణ ఎన్నికలకు సహాయ కేంద్రాలుగా 12 ఎంపిక చేసి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసిల్దార్ శ్రీకాంత్ కోరారు.

## తల్లికి మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే ఆల



**దేవరకద్ర,మే 12 ప్రభాతవార్త :** తన తల్లి వరలక్ష్మమ్మకు మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన తల్లికి పూల బొకే అందజేసి ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు.

## హజ్ యాత్రకు వెళ్ళబోతున్న మహమ్మద్ కాజా సోఫిద్దిన్ (హకీం)

**సన్మానించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి ప్రతినిధి మే 12 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలో16వ వార్డు పాతకోటకు చెందిన మహమ్మద్ ఖాజా సోఫిదిన్ (హకీం) హజ్ యాత్రకు వెళ్లబోతున్న సందర్భంగా శాలువా కప్పి పూల దండలతో సన్మానం చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఈ కార్యక్రమంలో ,మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ లతీఫ్, కౌన్సిలర్ బి వెంకటేశ్వర్లు ఎస్ఎల్ఎన్ రమేష్, అయుఫ్ ఖాన్, మహమ్మద్ వాసిమ్ ,మహమ్మద్ ఇర్ఫాన్, మల్లారెడ్డి, చిన్ననాటి స్నేహితులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం...

**-తహసీల్దార్ రవికుమార్**

**వెల్దండ, మే 12 ప్రభాతవార్త:** నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మండల పరిధిలో 39 పోలింగ్ బూతులు ఉన్నాయని, కంటోనిపల్లి, తిమ్మినోనిపల్లి, కేస్లీతాండ, మర్రిగుంతతండాల్లో కొత్త పోలింగ్ బూతులను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అధికారులు పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలను ఒక్కో బూతుకు కేటాయించారని, ప్రజలందరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికే వచ్చే ఓటర్లకు బూతుల వద్ద అన్ని వసతులను కల్పించారన్నారు. పోలింగ్ బూతుల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించామన్నారు.

## ప్రత్యేక పూజలో వంశీచంద్‌రెడ్డి దంపతులు



**మహబూబ్‌నగర్,మే 12 ప్రభాతవార్త :** పార్లమెంట్ ప్రచారంలో నిమిషం కూడా తీరిక లేకుండా బిజీ బిజీగా గడిపిన చల్లా వంశీచంద్‌రెడ్డి ఆదివారం ఆధ్యాత్మి కత చింతనలో నిమగ్నమయ్యారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ శంకరాచార్యుల జయంతి సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారిని శాలువాతో సన్మానించారు. పాలమూరు ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు పారి రైతులు, రైతు కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తాను ఎంపిగా గెలిచి పాలమూరును అభివృద్ధి పథంలో నడిపించేందుకు బలం ఇవ్వాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ సౌజన్యంతో వేసవి శిక్షణ శిబిరం



**వెల్దండ, మే 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఐక్యత ఫౌండేషన్, శృతిలయ కల్చరర్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల్లోని సృజనాత్మకతను బయటకు తీసి విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరంలో శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులను ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెమోంటోలను బహుకరించారు. కార్యక్రమంలో అకాడమి చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్, జనరల్ సెక్రటరి వనం విజయ్‌కుమార్, సభ్యులు అభినవ్‌రెడ్డి, శ్రీరామ్, జ్యోతి, మంజుల, రవళి, ప్రసన్న, శ్రీకళ తదితరులు ఉన్నారు.



**నకిలీ ఓటరనే ఆరోపణ వస్తే...**

ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత అతడు అసలు ఓటరు కాదని నకిలీ ఓటరని పోలింగ్ ఏజెంట్ల నుండి ఆరోపణలు రావొచ్చు. ఆసమయంలో అనుమతించేదే ఛాలెంజ్ ఓటు. ఆరోపణ చేసిన ఏజెంట్ నుండి రూ.2రుసుము తీసుకుని రసీదు ఇస్తారు. తర్వాత ఏజెంటు ఓటరు వాదనను అధికారి విని ఇతర ఓటర్ల నుండి వివరాలు తీసుకుంటారు. నిజమైన ఓటరుగా తేలితే ఓటేయడానికి అనుమతిస్తారు. లేకపోతే అతడిని పోలీసులకు అప్పగిస్తారు. ఛాలెంజ్ ఓటు వేసిన వ్యక్తి పేరు, చిరునామా ఫారం-14లో పేర్కొంటారు.

**దివ్యాంగుల కోసం..**

పురుషులకు, మహిళలకు దివ్యాంగులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన క్యూలో నిల్చోవాలి. దివ్యాంగుల కోసం ఈసారి ప్రత్యేక వాహన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఇంటివద్ద నుండి తీసుకెళ్లి ఓటు వినియోగించుకున్న తర్వాత తిరిగి వాహనంలో ఇంటికి చేరుస్తారు. పోలింగ్ కేంద్రం వద్ద వీరికోసం ప్రత్యేక ర్యాంపులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద వీరికి వెయింటింగ్ రూం, తాగునీరు మరుగుదొడ్డి ,తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంధులకోసం బ్రెయిలీ లిపితో కూడిన బ్యాలెట్‌ను అందుబాటులో పెడుతున్నారు. అలాగే ఈసారి అందులు, దివ్యాంగులు ,వృద్దుల కోసం హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే చాలామంది దానిని వినియోగించుకున్నారు.

# దృష్టి మరల్చి చోరీ చేసిన దొంగల అరెస్టు

తార్నాక, మే 12 ప్రభాతవార్త : దృష్టి మరల్చి చోరిలు, దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీ సులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. మహరాష్ట్రకు చెందిన ముఖేష్( 35) మేస్త్రీ పనిచే స్తున్నాడు. ఇదిలా ఉండగా ఈ నెల 6న నాగోల్‌నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు రోడ్డుపై ఆటో కోసం ఎదిరిచూస్తున్నాడు. అదే సమయంలో నగరంలోని బార్కాస్‌కు చెందిన యాసిన్ అలీ ఖాద్రి (21), పహడిషరీఫ్‌కు చెందిన షేక్ ఉమ్రాన్, యాఖత్‌పూరాకు చెందిన సయ్యద్ అదిల్(32) కలిసి ఆటోలో వచ్చారు. ముఖేష్‌ను ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో అతని దృష్టి మరలించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. తార్నాక ప్రధాన రోడ్డులో ఉన్న గుడ్‌ల్యాండ్ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే ఆటోలో స్థలం సరిపోవడంలేదని అతనిని మార్గమధ్యలో దింపి సెల్‌ఫోన్‌తో ఉడాయించారు. అతను మరో ఆటోలో సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడికి వెళ్లిన తరువాత తన సెల్‌ఫోన్ చోరికి గురైనట్లు గ్రహించి తిరిగి ఓ.యూ పిఎస్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. దీంతో ఓ.యూ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. ఆదివారం నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గతంలో కూడా వీరిపై కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి ఆటోతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నట్లు డిఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై సిహెచ్.రవికుమార్ తెలిపారు.

# నేడే పోలింగ్

- ఓట్ల పండగకు సర్వం సిద్ధం
- పోలింగ్ సెంటర్లకు చేరిన ఈవిఎంలు, సిబ్బంది
- ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం 6గంటలకు ముగింపు
- 40వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్



**మౌంటెడ్ కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కి లింక్ చేశారు. ఎలాంటి చిన్న సమస్య తలెత్తినా వెంటనే అలర్ట్ అవుతారు. అందుకు 4వేలకు పైగా వైర్‌లెస్ సెట్లను సిబ్బందికి అందజేశారు.**



హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త: ఓట్ల పండగకు నగరం సిద్ధమైంది. నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అధికారులంతా సర్వం సిద్ధం చేశారు. గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లోని నాలుగు ఎంపి స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరుగుతుండగా దాదాపు పదివేల పోలింగ్ కేంద్రాల్లో కోటి పదిలక్షలమంది ఓటర్లు ఓటు వేయనున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగియనుంది. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో 4గంటల వరకే పోలింగ్ జరగనుంది. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందో బస్తు ఏర్పాటు చేశారు.

**పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా ఓట్లు.. పోలింగ్ సెంటర్లు**

హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో మొత్తం 22,17,305 ఓట్లు ఉండగా అందులో పురుషులు -11,25,283, మహిళలు -10,91,615, ఇతరులు -196, సర్వీస్ ఓట్లు 211 ఉన్నాయి. ఈపార్లమెంట్ స్థానంలో ఓటర్లకోసం 1944 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా 30మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 21,20,550 ఓట్లు ఉండగా అందులో పురుషులు-10,86,875 మహిళలు- 10,33,396, ఇతరులు -130, సర్వీస్ ఓట్లు 149 ఉన్నాయి. ఇందుకు 1,810 పోలింగ్ స్టేషన్‌కు ఏర్పాటు చేయగా 45మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 37,80,453 ఓట్లు ఉండగా అందులో పురుషులు -19,45,634, మహిళలు -18,33,430, ఇతరులు -542, సర్వీస్ ఓటర్లు 857మంది ఉన్నారు. ఇక్కడ మొత్తం 3,228 పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేగా 22 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే చేవెళ్ల పార్లమెంట్‌లో 29,39,057 ఓటర్లు ఉండగా అందులో పురుషులు -15,04,260, మహిళలు 14,33,830, ఇతరులు -280, సర్వీస్ ఓటర్లు 687మంది ఉన్నారు. వీరికి 2,877 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా 43మంది బరిలో ఉన్నారు.

**40వేల మందితో పటిష్టమైన బందోబస్తు..** ఎన్నికలకు మూడు కమిషనరేట్ల పరిధిలో భారీ ఏర్పాట్లు చేబట్టారు. మొత్తం 40 వేల మంది పోలీసులతో భారీ పహారా ఏర్పాటు చేశారు. ఇందులో హైదరాబాద్ పరిధిలో 20 వేల మంది, సైబరాబాద్ రాచకొండ పరిధుల్లో 20 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బలగాలు, కేంద్ర బలగాలతో బందోబస్తును పటిష్టం చేశారు.గ్రేటర్‌లో 27 అసెంబ్లీ నియోజికవర్గాలు వుండగా ఇందులో 15 హైదరాబాద్ పరిధిలో 12 ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వున్నాయి. అందులో హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజికవర్గాలు వున్నాయి. అలాగే ఈపార్లమెంట్ పరిధిలో 1500 సున్నిత, అతి సున్నితమైనవిగా పోలింగ్ కేంద్రాలు వున్నాయి. వీటిలో పాతబస్తీలోని చార్మినార్, యాకూత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పే ట్, కార్వాన్, నాంపల్లి, గోషామహాల్‌లలో ఎక్కువగా వుండడం గమనార్హం. ఈ ప్రాంతాలలో బందోబస్తు గురించి ఇప్పటికే ఏర్పాట్లు చేయగా ఎన్నికల పరిశీలకులు సైతం ఈ ప్రాంతాలను తనిఖీ చేసి, భద్రత గురించి సూచనలు చేశారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు..** పోలింగ్ కేంద్రాలను సిసికెమెరాల నిఘాలోకి తీసుకువచ్చారు. దాదాపు 5వేల సిసికెమెరాలతో పోలింగ్‌ను పర్యవేక్షిస్తారు. 3,783 కేంద్రాల్లో 50నుంచి 100 గజాల లోపు సిసికెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కనెక్ట్ చేశారు. పోలింగ్ సరళిని తెలుసుకునేందుకు ఐటి వింగ్‌ను నియమించారు.

**మన ఓటు ఎవరైనా వేస్తే...**

ఓటరు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు తనఓటును అప్పటికే ఇంకెవరైనా వేసినట్లు గమనిస్తే అతడు టెండర్డు ఓటు వేయవచ్చు. ఇతడిని నిజమైన ఓటరుగా అక్కడి అధికారి ధృవీకరించుకున్నాక బ్యాలెట్ పత్రాన్ని ఇస్తారు. అయితే ఈవీఎం ద్వారా ఓటు వేసేందుకు మాత్రం అనుమతించరు. టెండరు ఓటును ప్రత్యేకంగా భద్రపరుస్తారు. లెక్కింపులో అభ్యర్థుల మెజారిటీ కంటే టెండర్డ్ ఓట్లు ఎక్కువ వచ్చినప్పుడు మాత్రమే పరిగణంలోకి తీసుకుంటారు.

"ఓటు హక్కు ద్వారా పోరాడి రాజులు అవుతారో, అమ్ముడు పోయి బానిసలవుతారో నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది"-డాక్టర్ బిఆర్ అంబేద్కర్

-"అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు..ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు. పెట్టుకునే టోపీ కాదు..పెట్టిన టోపీ చూడు"-కాళోజీ

-"ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాలంటే..ఆ మాట ఇచ్చే ముందు ఆలోచించాలి"-అబ్దుల్ కలాం

నగరంలో ఈసారైనా ఓటింగ్ శాతం పెరుగుతుందా? గత ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలిస్తోన్న వారిలో నెలకొన్న సందేహం ఇది. ఓటేసేందుకు సోమవారం కార్యాలయాలకు సెలవిచ్చారు. షిఫ్ట్ పద్ధతిలో పనిచేసే సంస్థలు నిబంధనలకు తగినట్లుగా పని గంటలను మార్చుకున్నాయి.మంగళవారం ఒక్కరోజు సెలవు పెట్టుకుంటే శనివారం, ఆదివారం, సోమవారం, మంగళవారం కలిసి వస్తాయని కొందరు టూర్లకు ప్రణాళిక వేసుకోవడం పోలింగ్‌పై ప్రభావం చూపుతుందంటూన్నరు. పోలింగ్ రోజు ఇచ్చే సెలవు విలువైందని, దానిని ఓటు వేసేందుకు వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు. ఈ మేరకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్నికల సంఘం, ఓటు ఆవశ్యకతను తెలుపుతూ ప్రచారం చేసినా ఓటర్లలో చైతన్యం ఏ మేరకు వచ్చిందనేది సందేహమే.

# పోలింగు శాతం పెరిగేనా..?

## సాకులొద్దు.. ఓటు ముద్దు ❖ ఓటింగ్ డే.. నాట్ ఏ హాలిడే



హైదరాబాద్, 12 ప్రభాతవార్త : ఎప్పటిలాగానే నగరంలో చాలా మంది ఓటర్లు సాకులు చెప్పడం ప్రారంభించారు. తమకింకా ఓటరు స్లిప్పులు అందలేదని చెబుతున్న వారు అధిక శాతం ఉన్నారు. చదువు కోని వ్యక్తులు ముందు రోజే పోలింగ్ స్టేషన్ ఎక్కడుందో తెలుసుకుంటుంటే, ఇప్పటికీ తమకింకా స్లిప్పులు అందలేదని విద్యాధికులు ఫిర్యాదులు చేస్తున్నారు. మొబైల్ ఫోన్ లేదంటే ఓటర్ ఐటీ కార్డు నెంబర్, అదీ లేదంటే పేరు, నియోజకవర్గాన్ని బట్టి పోలింగ్‌స్టేషన్ ఎక్కడుందో తెలిపే ఏర్పాట్లు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్నాయి.అయినా కొందరు సాకులు చెపిప పోలింగ్‌కు దూరంగా ఉండడం సరికాదంటూన్నరు. ఎన్నికలతో తమకు పనేం టంటూ కొందరు కుటుంబాలతో ఊర్లు వెళ్తున్నారు. మొత్తంగా గ్రేటర్ పరిధిలోని సికింద్రా బాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేయాలని అధికారులు, పోలీసులు, సెలబ్రిటీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**యువతా.. నీదే భవితా..**

నగర యువత ఉదాసీనత వీడాలి. బాధ్యతాయుతంగా వ్యవహ రించి ఓటు వేసేందుకు ముందుకు రావాలి. తమ భవితను తీర్చిదిద్దుకునేందుకు ఇదే సరైన సమయం. ఓటుతో తమకేం కావాలో పాలకులకు తెలియ జెప్పాలి. ఈ సాదాది కొత్తగా ఓటు హక్కును పొందిన యువతీ యువకులు లక్షల్లోనే ఉన్నారు. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజవకవర్గాల్లో కొత్త ఓటర్లు బాధ్యతగా ఓటు వేస్తే ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉం టుంది. పార్టీల ఎన్నికల ప్రచారంలో యువకులు పెద్ద సంఖ్యలోనే పాల్గొన్నారు. ఓటింగ్‌లో కూడా అదే విధమైన బాధ్యతను కొనసాగించాలి. కోటిన్నర జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో పోలింగ్ కనీసం 70 శాతం దాటాలంటే యువత బాధ్యతాయు తంగా ఓటేయాలి. 'ఒక్కో సిరా చుక్క..బంగారు భవిష్యత్‌కు చుక్కానిగా నిలిచేలా చైతన్యం కావాల్సి న తరునం ఆసన్నమైంది. రండి..కదలి రండి పోలింగ్ కేంద్రానికి ఉవ్వెత్తున తరలి రండి.. ఓట్ల పండుగలో పాల్గొనండి.



**గచ్చిబౌలి, కొండాపూర్ దారిలో నిర్మానుష్యం**

**కరుణించండి..**

**ఇష్టదైవాలపై భారం వేసిన అభ్యర్థులు**

**ఓటర్లతో పాటు దీవెనలందించాలని పూజలు**

**నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ముడుపులు**

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త : ప్రచారం బాగా చేశాం.. కాలికి బలపం కట్టుకున్నట్లుగా ఇంటింటికీ తిరిగినం. డబ్బులు కూడా గట్టిగానే పంచినం. ఇక ఓటర్ల దయ, అంతకంటే ఎక్కువగా నమ్ముకున్న దేవతల దీవెన. గెలుపోటముల బాధ్యత అంతా ఇద్దరిపైనే. నమ్మిన ప్రజలు సోమవారం ఓట్లు వేసి గెలిపిస్తారో.. ఇష్టదైవాలు అండగా నిలుస్తారో లేదో వేచి చూడాలి.. అని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. పోలింగ్‌కు మరొకిన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో ఆదివారం అనుచరులతో కొంతమంది తీవ్ర ఒత్తిడిని వ్యక్తం చేస్తూ మట్లాడడం ఆసక్తికరంగా మారింది. ఎన్నికలను పురస్కరించుకుని గ్రేటర్‌లోని సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో టఫ్‌ఫైట్ నడుసో_ంది.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో నేడు పోలింగు జరగనుంది. అధికారులు దీనికి సర్వసిద్ధం చేశారు. అయితే ఓటరు ఓటు వివరాలు ఎలా తెలుసుకోవాలి ? పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంటుంది? స్లిప్‌లు ఎలా తీసుకోవాలి? పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలనే విషయాలు తెలుకోవాల్సి ఉంది. ముఖ్యంగా కొత్తఓటర్లు.. దీనికి సంబంధించిన సవగ్ర వివరాలు తెలుసుకోవాల్సి న అవసరం ఉంది. ఎన్నికల సిబ్బంది కొద్దిరోజుల ముందు ఇంటింటికీ వెళ్లి పోలింగ్ స్లిప్పులను అందజేశారు. ఈస్లిప్‌లపై అసెంబ్లీ నియోజకర్గం, పోలింగ్ కేంద్రం, ఓటరు పేరు, చిరునామా, వివరాలుంటాయి. ఈ స్లిప్పులను ఆన్‌లైన్‌లో కూడా పొందే అవకాశం ఉంది. ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ (డబ్లూడబ్లూడబ్లూ.సిఈఓతెలంగాణ.ఎన్ఐసి.ఐఎన్)లోకి వెళ్లి" సెర్చ్ యువర్ నేమ్"ఆప్షన్‌పై క్లిక్ చేసి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి. నేషనల్ ఓటర్స్ సర్వీస్‌సెస్ పోర్టల్ ట్యాబ్ ఓపెన్ అవుతుంది. అందులో ఓటరు పేరు, తండ్రి పేరు, వయస్సు, రాష్ట్రం, జిల్లా , అసెంబ్లీ నియోజకవర్గం నమోదు చేస్తే ఓటు ప్రాథమిక వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఆపై"వ్యూ డిటైల్స్'-ఆప్షన్‌పై క్లిక్ చేయగానే పూర్తివివరాలు కనిపిస్తాయి. దాన్ని ప్రింట్ తీసుకోవచ్చు. స్లిప్పులు అందకపోయినా పోలింగ్ కేంద్రానికి వెళ్లి గుర్తింపు కార్డు చూపించి ఓటేయ్యొచ్చు.

# పద.. పద ఓటేద్దాం



## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- సమగ్ర సమాచారం కోసం 'నా ఓట్ 'యాప్, ఎన్నికల సంఘం వెబ్‌సైట్
- పోలింగ్ కేంద్రం, సేవలు తెలుసుకునే అవకాశం

✍ ప్రభాతవార్త - హైదరాబాద్

**పోలింగ్ కేంద్రం ఎక్కడా..?..** ఎన్నికల సిబ్బంది పంపిణీ చేసిన స్లిప్పుల వెనక పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలను పొందవచ్చు. గూగుల్ మ్యాప్‌తో పోలింగ్ కే ంద్రాలను అనుసంధానం చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో "సెర్చ్ యువర్ నేమ్ "ఆప్షన్‌పై క్లిక్ చేగానే గూగుల్ మ్యాప్ లింక్ ఓపెన్ అవుతుంది. పోలింగ్ కేంద్రం చిరునామా కనిపిస్తుంది. నావిగేషన్‌లో డైరెక్షన్ వస్తాయి.

**ఓటు వేసేందుకు ఏమేం కావాలి**

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి. ఫోటోతో కూడిన ఓటరు గుర్తింపు కార్డు లేకపోయినా ఇతర గుర్తింపు కార్డులను తీసుకెళ్లవచ్చు. పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, విద్యాసంస్థలు జారీ చేసిన ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు,పెన్షన్ పత్రాలు, రేషన్‌కార్డు, బ్యాంక్‌లు లేదా పోస్టాఫీసులు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్వాతంత్య సమరయోధుడి గుర్తింపు కు జారీ చేసిన ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు, ఎన్నారైలు అయితే ఒరిజినల్ పాస్‌పోర్టు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అయితే వారి గుర్తింపు కార్డులు.. వంటివి చూపవచ్చు. ఓటరు స్లిప్పు లేకపోయినా పైవాటిలో ఏదేని ఒకటి తీసుకెళ్లవచ్చు. ఇవి ఏవి లేకున్నా ఫోటోతో ఉన్న పోలింగ్ స్లిప్పు.. ఓటరు జాబితాలో పేరుంటే చాలు ఓటు వేసే అవకాశం ఉంటుంది.

**ఫోన్,"కెమెరా నిషేదం...** ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లను తీసుకెళ్లకూడదు. ఇలా ఎవరైనా తీసుకొస్తే పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల పరిధిలోపు ఫోన్లు వాడకూడదు.

**పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక**

పోలింగ్ కేంద్రంలో ఒకే వరుసలో కూర్చున్న పోలింగ్ అధికారుల్లో మొదటి అధికారి వద్దకు వెళ్లాలి.వీరు ఓటర్ల జాబితా తనిఖీ అధికారిగా వ్యవహరిస్తారు. ఆయనకు ఓటరు గుర్తింపు కార్డు చూపాలి. కార్డును పరిశీలించిన అధికారి ఓటరుకు సబంధిత పేరు, సీరియల్ నంబర్ నుపైకి చదువుతారు. అక్కడే ఉన్న వివిధ పార్టీల పోలింగ్ ఏజెంట్లు వారి వద్దఉన్న జాబితాలోని వివరాలను సరిచూసుకుంటారు. పోలింగ్ ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే అదే వరుసలో ఉన్న మరో అధికారి వద్దకు వెళ్లాలి.ఆయన ఓటరు చూపుడు వేలిపై ఇంకుతో గుర్తు పెడతారు. ఆతర్వాత అక్కడ రిజిస్టరులో ఓటరు సంతకం చేసిన తర్వాత ఓటరు స్లిప్‌ను ఇస్తారు. ఆవరుసలో కూర్చున్న మరో అధికారి ఆస్లిప్పులను తీసుకుని ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో కంట్రోల్ బటన్‌ను నొక్కుతారు. ఓటింగ్ కంపార్టుమెంట్‌లోని బ్యాలెట్ యూనిట్ ఓటింగ్‌కు సిద్ధమవుతుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో బ్యాలెట్ యూనిట్‌లో మనం ఎంచుకు న్న పార్టీ గుర్తులను చూడాలి. ఈసారి కొత్తగా పార్టీ గుర్తు పక్కన అభ్యర్థి ఫోటో చూసి కూడా ఓటు వేయవచ్చు.పక్కన నీలిరంగు బటన్ నొక్కాలి.బటన్ నొక్కడంతో గుర్తుకు ఎడమవైపున ఉన్న చిన్న బల్బు వెలగంతోపాటు బీఫ్‌మని శబ్దం చేస్తుంది. అంటే ఓటు వినియోగించుకున్నట్లు గుర్తు. ఆవెంటనే బ్యాలెట్ యూనిట్‌కు అనుసంధానంగా ఉన్న వీవీప్యాట్ యంత్రంలో ఓటు వేసిన గుర్తుతో కూడిన స్లిప్పు ఏడు సెక్లతోపాటు ఓటరుకు కనిపిస్తుంది. ఆవెంటనే అది బాక్సులోకి చేరుతుంది. ఆతర్వాత ఓటరు పోలింగ్ కే ంద్రం నుండి బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

**వీవీప్యాట్‌లో వేరేది కనిపిస్తే..**

ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్ స్లిప్పుల్లో తాను ఎంచుకున్న అభ్యర్థి కాకుండా వేరే అభ ర్థికి ఓటు పడినట్లు కనిపిస్తే ఓటరు ఫిర్యాదు చేయవచ్చు.ప్రిసైడింగ్ అధికారి ఓటరుతో మాట్లాడి అదితప్పుడు ఫిర్యాదు అయితే హెచ్చరిస్తారు. నిజమనిపిస్తే ఓటరు నుండి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుని పోలింగ్ ఏజెంటు సమక్షంలో ఓటింగ్ మిషన్‌లో టెస్ట్ నమోదుకు అనుమతిస్తారు. ఓటరు ఫిర్యాదు చేసినట్లుగానే వీవీప్యాట్‌లో నుండి వచ్చే స్లిప్పుల్లో ఓటు వేసిన అభ్యర్థి వివరాలు కాకుండా ఇతర వివరాలు వస్తే వెంటనే పోలింగ్‌ను నిలిపివేస్తారు. ఒకవేళ ఓటరు ఆరోపణ తప్పని తేలితే ఫారం 17లో ఆఓటరు సంతకం తీసుకుని ఓటరును పోలీసులకు అప్పగిస్తారు.

# సమాజం కోసం కష్టపడేవారిని ఓటు వేసి ఎన్నుకోవాలి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త: దేశం కోసం, సమాజం కోసం కష్టపడేవారిని ఓటు వేసి ఎన్నుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శంకరమఠ్ ఆలయంలో ఆదిశంకరాచార్యుల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అంబర్‌పేటలోని మహంకాళి అమ్మవారిని, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌ను సందర్శించిన ఆయన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం బల్కం పేట ఎల్లమ్మ తల్లిని, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లా డుతూ దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, మన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని, ప్రపంచంలో మన దేశ గౌరవం మరింత పెరగాలని, ఉగ్రవాదం, తీవ్రవాదం లేని శాంతియుత వాతావరణంలో మనమంతా ఆనందంగా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మ వారిని, శంకరాచార్యుల వారిని కోరుకుంటున్నానని అన్నారు.

ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నదని, అమ్మవార్లు, ఆదిశంకరాచార్యుల ఆశీస్సులతో ప్రధాని మోదీ నాయకత్వంలో వచ్చే మూడు సంవత్స రాలలో మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్న విశ్వాసం నాకుందని తెలిపారు. పోలింగ్‌డేను హాలిడేగా చూడకుండా, దేశంకోసం పనిచేసే వారిని ఓటువేసి ఎన్నుకోవాలని సూచించారు.

# ఓటు మన హక్కు-దేశానికి ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసి'గా పరిగణించి ఓటు వేయాలి

**కార్పొరేటర్ పావనీ వినయకుమార్**

చిక్కడపల్లి, మే 12 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయకుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్నా, మనం కోరుకునే అభివృద్ధికి రేపటితరం వారికి మంచి భవిష్యత్తు నిర్ణయించే గొప్ప అవకాశం ఓటు వేయడం అని అన్నారు. దేశా నికి అతిపెద్ద ఓట్ల పండుగ పార్లమెంట్ ఎన్నికలు, ముఖ్యంగా యువత తప్పకుండా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ సత్తాచాటాలన్నారు. ఎన్నికల రోజు వెకేషన్ డేగా కాకుండా ఓటింగ్‌డేగా పరిగణించాలని, ఇది ప్రతి ఒక్కరికి సంబంధించిన 'ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసీ' అని అన్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు సహకరించాలన్న బాధ్యత తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఏఆర్ఓ రాజు

## సజావుగా ఎన్నికలు ముగిసేలా తగు ఏర్పాట్లు

### -అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు

**జహీరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ఈ నెల 13న జరిగే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఓ ఎస్ రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఎన్నికలు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 313 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 389 మంది చొప్పున ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను, 750 అదనపు ప్రిసైడింగ్ అధికారులను నియమించామన్నారు. 35 రూట్లుగా విభజించి మండలానికి ఒకటి చొప్పున ఆదర్శ పోలింగ్ కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు సంబంధించి పోలింగ్ సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేయడం పూర్తయిందన్నారు. ఎన్నికల ప్రశాంతంగా ముగిసేల తగు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈవీఎంలు మోరాయించినట్లయితే వాటి స్థానంలో వెంటనే ఏర్పాటు చేసందుకు అదనపు ఈవీఎంలను అందుబాటులో ఉంచామన్నారు.

## నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్న

## 40 వేల పై చిలుకు ఓటర్లు

**కొండపాక, మే 12, ప్రభాతవార్త :** ఈ నెల 13న నిర్వహిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొండపాక మండలంలోని 15 గ్రామాల్లో పురుషులు 12736 మంది, 13339 మంది మహిళ ఓటర్లు, ట్రాన్స్‌జెండర్ ఓటరు ఉన్నారు. కాగా మండలంలో మొత్తం ఓటర్లు 25,776 వేల మంది ఓటర్ల కోసం 31 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. అదే విధంగా కుకునూరుపల్లి మండలపరిధిలో 15 గ్రామాల్లో 7160 మంది పురుషులు, 7451 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. మండలంలో మొత్తం 14,611 వేల ఓటర్లకుగాను 19 పోలింగ్ బూత్‌లను అధికారలు ఏర్పాటు చేశారు. రెండు మండలాల్లో సమస్యాత్మక గ్రామాల్లో సిసి కెమెరాల పర్యవేక్షణలో ఓటింగ్ నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఎన్నికలకు భారీ బందోబస్తు : డిఎస్‌పి



ఎన్నికల పోలింగ్ బందోబస్తుపై వివరిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

**జహీరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అవసరమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం వద్ద డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఇద్దరు డిఎస్‌పిలు, 10 మంది సిఐలు, 250 మంది ఎస్‌ఐలు, 700మంది కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలో 25 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని, ఆయా గ్రామాల్లో అందుకు తగు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. 35 మొబైల్ పార్టీలను ఏరాపటు చేసి పోలింగ్ పరిస్థితులను ఎప్పటికి అప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో పట్టణ సిఐ ఆర్ రవి, రూరల్ సిఐ నయీమోద్దిన్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## సామాగ్రితో పోలింగ్ కేంద్రానికి తరలిన సిబ్బంది



పోలింగ్ సామాగ్రితో తరలి వెళుతున్న సిబ్బంది

**జహీరాబాద్, మే 12, ప్రభాతవార్త:** జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియంలో ఏర్పాటుచేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రం నుంచి నియోజక వర్గంలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రితో ఆదివారం సాయంత్రం తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలివెళ్లేల బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. పంపిణి కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బందికి సమాగ్రిని అందించి తగు సూచనలు, సలహాలు అందచేసి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు, ఇతర సంబంధించి సమస్యలు ఉంటే వెంటనే ఆయా సెక్టార్ అధికారులకు తెలియచేయాలని ఆర్‌డిఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజు సూచించారు.

## ఓటు వేసిన వారికి ఉచిత వైద్యం

**హుస్నాబాద్, మే 12, ప్రభాతవార్త :** హుస్నాబాద్ డాక్టర్స్ అసోసియోషన్ సహకారంతో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియోషన్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వారిలో అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా ఓపి సేవలను అందించనున్నట్లు హుస్నాబాద్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు బింగి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారు చికిత్స పొందాలంటే ఓటు వేసిన వేలు సిరా చుక్కను చూపిస్తే సరిపోతుందన్నారు. ఈ సేవలు హుస్నాబాద్ పట్టణంలోని ప్రాణదాత పిల్లల ఆసుపత్రి, శ్రీశ్రీనివాస మల్టి స్పెషాలిటీ, సురక్ష, సమత, కావ్య పిల్లల ఆసుపత్రులతో పాటు మహాలక్ష్మి, మహావీర ఆసుపత్రులలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

## క్రైస్తవ సమాజం శాంతిగా, సురక్షతంగా ఉన్నారు

**సిద్దిపేట రూరల్, మే 12, ప్రభాతవార్త :** క్రీస్తు జన్మదినం క్రిస్టమస్ పండుగ వేడుకలను అధికారికంగా నిర్వహించిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలంగాణ గాడ్ విజన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నెలమల్లి సికిందర్ అన్నారు. అదివారం అయన మాట్లాడుతూ గత పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో క్రైస్తావ సమాజం శాంతిగా, సంతోషంగా సురక్షతముగా ఉన్నరని తెలిపారు. సెక్యులర్ పార్టీ బిఆర్ఎస్‌కు పాస్టర్లు, క్రైస్తవులు అండగా నిలవాలని కోరారు. బస్సు యాత్రలో భాగంగా ఇటీవల సిద్దిపేటకు విచ్చేసిన మాజీ సిఎం కెసిఆర్‌కు తెలంగాణ క్రైస్తావ సమాజంలో పర్యటించిన నివేదికను అందించినట్లు తెలిపారు. సమావేశంలో పాస్టర్లు దోమకొండ సాగర్, బిఎ పాల్, అబ్రహం, నాగరాజు, చందు, రాజాత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెలమల్లి సికిందర్

# ఓటుహక్కును వినియోగించుకోని ఉద్యోగులు, యువత

### ప్రభుత్వం చర్యలు తీసుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలి

**కొండపాక, మే 12, ప్రభాతవార్త :** ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, చదువుకున్న యువతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనఉంది. ఉద్యోగులకు, చదువుకున్న యువతకు ఓటు హక్కు వినియోగంపై స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకోవడంలేదు. ఎన్నికల డ్యూటీ నిర్వహణకు వెళ్లి ఉద్యోగులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ముందుగానే ఓటు హక్కును వినియోగించుకుంటుండగా కొంత మంది మాత్రం ఓటు వేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ ఓటు హక్కును అపహాస్యం చేస్తున్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంలో, దేశ అభివృద్ధిలో అందరికి సమాన హక్కు ఉండాలనే ఉద్దేశంతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటుహక్కును కల్పించిన డా॥ బి.అర్ అంబేద్కర్ ఆశయాన్ని నీరుగారుస్తూ దేశానికి దశ, దిశను చూపే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడంలేదు. ఎన్నికల రోజు ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఓటువేయడానికి ఎన్నికల డ్యూటీలు లేని ప్రభుత్వ ఉద్యోగులు కొంత మంది అంతగా ఆసక్తి చూపడం లేదు.

ఎన్నికల రోజు కొంత మంది ఓటు వేయకుండా సొంత పనుల నిర్వహణ కోసం, చిట్టిలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, వినోద, విహార యాత్రలకు, విందులు, వినోదలకు, సెటిల్‌మెంట్లు ఇతర వ్యాపకాలకోసం ప్రభుత్వం ఇచ్చిన వేతనంతో కూడిన సెలవు దినాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరంఉంది. చదువుకున్న యువత జల్సాలు చేస్తూ సెల్‌ఫోన్ మోజులోపడి ఓటు వేస్తే నాకేమోస్తుంది, నేను ఒక్కడిని వేయకుంటే ఏమి కాదులే అని ధోరణితో నిర్లక్ష్యం వహిస్తున్నారు. యువత చేతిలో దేశ భవిష్యత్ అధారపడి ఉందని తెలిసినా వారు ఓటుహక్కును వినియోగించుకోవడం లేదు. ఒక రకంగా నిరక్షరాస్యులు, రోజువారి కూలీ పనులు చేసుకొనే ఓటర్లు మాత్రం ఉదయం నుండి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరు తప్పకుండా ప్రతి ఎన్నికల్లో ఓటు వేసేలా అవగహన కల్పించాల్సిన అవసరం ఉంది..

# పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

### ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాంమూర్తి

**హుస్నాబాద్, మే 12, ప్రభాతవార్త**

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు హుస్నాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాంమూర్తి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మోడల్ (ఆదర్శ) పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాలకు ఈవిఎం మిషన్లతో పాటు సంబంధిత పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 32 సెక్టార్లు ఏర్పాటుచేయడం జరిగిందని ఏర్పాటు చేసిన ప్రతీ పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 2లక్షల 30వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అందుకు సంబందించిన సెంటర్ల తో పాటు అక్కడ విధులు నిర్వహించేందుకు సెక్టోరియల్ అధికారులు 304 మంది పివో ఎపివోలు 604 మంది పోలీస్‌సిబ్బంది 600 మంది విధులు నిర్వహించనున్నట్లు సూచించారు. పంపిణీ కేంద్రం నుండి ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు 64 బస్సులతోపాటు ఇతర వాహనాలు వినియోగించారు. ఏర్పాటుచేసిన కేంద్రాలలో ఎన్నికల సిబ్బందికి రూట్‌ల వారిగా విధులు కేటాయించి రూట్లలో ఎన్నికల సామాగ్రిని పోలీస్ బందోబస్త్ మధ్య తరలించామన్నారు. నేడు జరిగే ఎన్నికలు ఉదయం 7గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు. ఎన్నిక పూర్తయ్యాక సాయంత్రం మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో మిషన్లను బద్రపరుస్తామన్నారు. నియోజకవర్గంలో సమస్యాత్మక కేంద్రాలు 88 ఉన్నాయని ఆ కేంద్రాల వద్ద పారామిటలరీ బలగాలతో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల బందోబస్త్‌ను స్థానిక ఎసిపి వాసాల సతీష్, సిఐ శ్రీనివాస్‌లు పర్యవేక్షించనున్నారు.



ఎన్నికల సామాగ్రితో సెంటర్లకు వెళుతున్న అధికారులు



పోలింగ్ సామాగ్రితో తరలివెలుతున్న పోలింగ్ సిబ్బంది

## పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు సర్వం సిద్ధం

**నర్సాపూర్ మే, 12. ప్రభాతవార్త :** నేడు(సోమవారం) జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్బంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం బివిఆర్ఐటి కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవిఎంలను, పోలింగ్ సామాగ్రిని సిబ్బందికి అందజేయడం జరిగింది. సామాగ్రిని తీసుకుని సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరిలివెళ్లారు. ఈ సందర్బంగా ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డివో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో 307 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 307 మంది బూత్ అధికారులు. 344 మంది ఏవోలు, 344 మంది ఏపివోలను నియమించామని, అదేవిధంగా 30 మంది రూట్ ఆఫీసర్లు, 30 మంది సెక్టారనఆఫీసర్‌లను నియమించి, 692 పోలింగ్ సిబ్బంది నియమించామని తెలిపారు. కాగా నేడు ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిదంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తగిన వసతులుకల్పించామని ఆయన తెలిపారు. తప్రాన్ డీఎస్పీ వెంకటొరెడ్డి, ఆర్డీవో జయచంద్రారెడ్డి పర్యవేక్షణలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్‌లు కమలాద్రి, శ్రీనివాస్‌చారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లను సందర్శించిన సైబరాబాద్ సిపి

**కడ్తాల్, మే 12 ప్రభాతవార్త :** పార్లమెంట్ 2024 ఎన్నికల సందర్భంగా కడ్తాల్ మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్లను, పోలీస్ స్టేషన్‌లను సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి ఆకస్మికంగా సందర్శించి ఎన్నికల డ్యూటీలో చేయవల సిన విధుల గురించి వివరించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి, శంషాబాద్ డిసిపి నారాయణ రెడ్డి, అడిషనల్ డిసిపి రామ్‌కుమార్, కడ్తాల్ ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలు

**కొత్తూర్, మే 12, ప్రభాతవార్త :** శ్రీసంత్ సేవా లాల్ మహారాజ్ ఉత్సవాలు ఆదివారం కొత్తూర్ మండలంలోని మల్లాపూర్ తండాలో జరిగా యి. ఈ వేడుకలకు స్థానిక జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మా నించారు. ఆమె మాట్లాడుతూ గిరిజనుల హక్కులకై పోరాడిన సేవాలాల్ మహారా జ్‌ను గిరిజను లు తమ ఆరాధ్యదైవంగా కొలుస్తారన్నారు. ఆయన చూపించిన మార్గన గిరిజనులు నడుస్తూ దినదినాభివృద్ధి చెందుతున్నారన్నారు. గూడూరు మాజీ సర్పంచ్ సత్తయ్య, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, గిరిజన నాయకులు ఉన్నారు.



ట్రోఫీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రచనరెడ్డి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి

## ఫుట్‌బాల్ ట్రోఫీ గెలుచుకున్న రచనరెడ్డి

**కొల్చారం, మే 12 ప్రభాతవార్త:**

కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమన్నగారి లక్ష్మీరవీందర్‌రెడ్డి కూతురు రచనరెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన ఇండియా టీమ్‌లో భాగంగా ఫుట్ బాల్ క్రీడా పోటీల్లో సీఎం రేవంత్‌రెడ్డి జట్టులో కలిసి ఆడి ట్రోఫీ గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మారెల్లి అనిల్ అన్నారు. ఆదివారం కొల్చారం మండలం పైతర గ్రామంలో అనిల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన సోమన్నగారి లక్ష్మీ రవీందర్ రెడ్డి కూతురు రచన (హెచ్‌సీయూ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ మాస్టర్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఆదివారం జరిగిన ఇండియా టీమ్‌లో భాగంగా ఫుట్ బాల్ పోటీల్లో సీఎం రేవంతన్న క్యాప్టెన్సీలో యూనివర్సిటీ విజేతగా నిలిచారు. అనంతరం విజేతగా నిలిచిన స్టూడెంట్స్‌ను, రచనను సీఎం రేవంత్‌రెడ్డి అభినందిస్తూ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పైతర గ్రామ ప్రజలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థి ఉదయ్ కిరణ్ అదృశ్యం

**సంగారెడ్డి టౌన్, మే 12, ప్రభాతవార్త:** విద్యార్థి వడ్డే ఉదయ్‌కిరణ్ అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట కాలనీలో ఈ నెల 9న చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ భాస్కర్ కథనం ప్రకారం... ఈ నెల 9న రాజంపేటలోని ఇంటి నుంచి వెళ్లిన ఉదయ్‌కిరణ్ రాత్రి ఎంతకూ ఇంటికి చేరుకోలేదన్నారు. వడ్డె ఉదయ్ కిరణ్ తండ్రి వడ్డే సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, విద్యార్థి ఆచూకి తెలిస్తే పట్టణ పోలీసు ఠాణా 8455-276333, ఇన్‌స్పెక్టర్ 8712656718లకు సమాచారం అందించాలని ఎస్ఐ భాస్కర్ సూచించారు.

# భక్తులతో కిటకిట లాడిన వనదుర్గామాత ఆలయం

**పాపన్నపేట, మే 12, ప్రభాతవార్త:**

పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో బాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది రవి వీర్‌కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, భత్తిని రాజు, శ్రీకాంత్ తదితరులు తగు ఏర్పాట్లు చేశారు. భక్తులు అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజ నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ నరేస్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.



పూజలు అందుకుంటున్న వనదుర్గా భవాని మాత, అమ్మవారి దర్శనానికి బారుల తీరిన భక్తులు



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

## బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే ఓడించే కుట్ర

### -బిజెపి ఎంపి అభ్యర్థి రఘునందన్‌రావు

**మెదక్ మున్సిపాలిటీ, మే 12 ప్రభాతవార్త:** మెదక్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో రఘునందన్‌రావు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ హరీష్‌రావు ఆదేశాల ముకు సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటుకు రూ. 500, రూ. 1000 చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు. ఓటమిని అంగీకరిస్తూ బీఆర్ఎస్ గెలుపు కోసం కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని స్థానిక పోలీసులకు, ఉన్నత స్థాయి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినా సంఘటన స్థలానికి వెళ్లేందుకు రెండు గంటల సమయం పట్టిందన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు తేటతెల్లమైందని, బీఆర్ఎస్ డబ్బులు పంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి పోలీస్ శాఖ పూర్తి సహకారం ఇస్తుందన్నారు. హరీష్‌రావు నైతిక ఓటమిని ఒప్పుకోవాలని, సిద్ధిపేటలో బీజేపీకి ఎక్కువ ఓట్లు వస్తున్నాయని సర్పంచులను, ఎంపీటీసీలను అందరినీ పిలిచి డబ్బులు పంచుతున్నారని సీపీకి చెబితే చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ స్టేషన్‌లలో సాయంత్రం బ్యాలెట్ బాక్స్‌లు సీల్ వేసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన డబ్బులను నిన్న ఒక ఫామ్‌హౌస్‌లో మీటింగ్ పెట్టి ఏ బూత్‌కు ఎంత ఇవ్వాలనే వివరాలతో వాటిని పోలీసులు పట్టుకున్నా అక్కడి ఫామ్‌హౌజ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా బాధ్యులను శిక్షించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ వ్యవహారం అంతా మెదక్ పార్లమెంట్ ప్రజలు చూస్తున్నారని, దీనిని భారత ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎస్పిలకు రాత పూర్వకంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం సతీషన, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి మదు, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి చేరిన పోలింగ్ సిబ్బంది



ఎన్నికల సామాగ్రితో పోలింగ్ సిబ్బంది

**వెల్దుర్తి, మే 12 ప్రభాతవార్త:** నేడు(సోమవారం) పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా మండలానికి పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్‌లో ప్రజలు స్వచ్చందంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, మే 12, ప్రభాతవార్త :** ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు, బీమా తప్పకుండా చేయించుకోవాలని చిన్నకోడూరు మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెరుకు నారాయణ అన్నారు. అదివారం మాచాపూర్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గాజుల ఎల్లయ్య ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.10 వేల అర్థిక సహాయం అందించారు. ఈ సందరర్బంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల భవన నిర్మాణ కార్మికులు అయా సంఘాల్లో చేరి సభ్యత్వాన్ని స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టబోయిన రవి, లింగం, ఉడుల ఐలయ్య, కామ లింగయ్య, భూమయ్య, పర్శరాములు, రాగిరి కనకయ్య, వెంకటి, ఎల్లం, పోచయ్య, రాజమల్లు, మచ్చ రాజమల్లయ్య, జిట్ట శ్రీనివాస్, నాగయ్య, ప్రతాప్‌రెడ్డి, కనకయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట ఉమ్మడి మండలంలో

## 81 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

**శామీర్‌పేట, మే 12, ప్రభాతవార్త** శామీర్‌పేట ఉమ్మడి మం డలంలో మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికలు సోమవారం జరుగు తున్నందున సంబంధిత ఎన్నికల అధికారులు అంత సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగనుంది. శామీర్‌పేట ఉమ్మడి మండలంలో 81పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 77వేల 482మంది ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇక వీటిలో శామీర్‌పేట మండలంలో 33పోలింగ్ కేంద్రాలు ఉండగ 33,215మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మూ దుచింతలపల్లి మండలంలో 24పోలింగ్ కేంద్రాలు ఉండగ వీటిలో 20,265మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించుకోనున్నారు. తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగ 24,002మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లోని 125పోలింగ్ కేంద్రంలో మహిళా సిబ్బంది పోలింగ్‌ను నిర్వహించనున్నారు. తూంకుంట మున్సిపాల్టీలోని ఉప్పర్‌పల్లిలో 137పోలింగ్ కేంద్రంను మాడల్ కేంద్రంగా ఏర్పాటు చేయగ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల పోలింగ్ సిబ్బంది బస్సులో పోలీసు బందోబస్తుతో పోలింగ్ సామాగ్రితో ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బం దోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శామీర్‌పేట మండల తహసీల్దార్ యాద గిరిరెడ్డి, మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్‌లు ఎన్నికల నిర్వాహణకు తగు ఏర్పాట్లు చేసి గ్రామా ల్లోని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, ఏర్పాట్ల వివరాలను వారు తెలియజేశారు. ఉప్పరిపల్లిలో పోలింగ్ కేంద్రంను మోడల్ కేంద్రం గ గుర్తించి ఓటర్లను ఆకట్టుకునే విధంగ ఏర్పాట్లు చేయటం జరిగింది.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**అక్కన్నపేట, మే 12, ప్రభాతవార్త :** మండలంలోని తుర్కవాని కుంటకు చెందిన బద్దం మల్లారెడ్డి(56) నాలుగు రోజుల క్రితం టివిఎస్ ఎక్సెల్‌పై వ్యవసాయ పొలం నుండి తిరిగి ఇంటికి వస్తుండగా పోతారం శివారులో బండి అదుపుతప్పి బోల్తాపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అతడు మృతి చెందాడు. మల్లారెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ ఒక ప్రకటనలో తెలిపారు.

## చెరువులో మునిగి బాలుడి మృతి

**అక్కన్నపేట, మే 12, ప్రభాతవార్త :** చెరువు కట్టపై ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు అనంతలోకాలకు వెళ్లిన దుర్ఘటన అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రామవరం గ్రామానికి చెందిన మేడిచల్మి రమేష్‌కు ఇద్దరు కుమారులు అందు లో ఒక కుమారుడు సాయి కిరణ్ (6) శనివారం సాయంత్రం ఆడుకుంటానని చెప్పి చెరువు కట్టకు వెళ్లి చెరువులో దిగి ఆడుకుంటుండగా కాలు జారి నీటిలో మునిగి చనిపోయాడని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ ఒక ప్రకటనలో తెలిపారు.